
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



73.837 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో శనివారానికి 73.837 టీఎంసీలు ఉన్నాయి. 15,064 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నానదికి 10,150, ఉత్తరకాలువకు 50, కండలేరుకు 2200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,31,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,950
3 శాతం జీఎస్టీతో	రూ.12,308
నవర (8 గ్రా)	రూ.98,464

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.2 /25.6

జిల్లాలో ఆదివారం అక్కడక్కడ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శనివారం గాలిలో తేమ 89 శాతం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,675 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 24,681 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని, ముందుగా వెళ్లిన వారిని అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

డిగ్రీ పరీక్షలకు 922 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) శనివారం ప్రారంభమయ్యాయని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 14,764 మంది విద్యార్థులకు 13842 మంది హాజరు కాగా, 922 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సీతారామపురం ఎంపీడీఓ సస్పెన్షన్

సీతారామపురం: సీతారామపురం ఎంపీడీఓ మారుబోయిన భాస్కర్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు అధికారిక వర్గాల ద్వారా విశ్వసనీయంగా తెలిసింది. 2024 అక్టోబర్ 4 నుంచి విధులు నిర్వహిస్తూ 2025 జూన్ 1 నుంచి మెడికల్ లీవ్‌పై వెళ్లిన ఆయన హయాంలో నేషనల్ హైవే నష్టపరిహారం, కాంట్రాక్ట్ పనుల రికవరీ సొమ్ము సుమారు రూ.11 లక్షల నిధులను గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో 'నిధుల గోల్ మాల్' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు ఆత్మకూరు డీఎల్‌పీఓను విచారణ అధికారిగా నియమించి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఆ నివేదికలో వాస్తవాలు తేలడంతో ఎంపీడీఓ భాస్కర్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఈ మేరకు రెండ్రోజుల క్రితం కార్యాలయానికి ఉత్తర్వులు పంపినట్లు తెలిసింది.

ఇంటి నుంచే స్త్రీనిధి రుణాలు, చెల్లింపులు

- వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్‌డీఏ పీడీ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలు ఇంటి వద్ద నుంచే స్త్రీనిధి రుణాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని, తిరిగి చెల్లించవచ్చని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. శనివారం డీఆర్‌డీఏ కార్యాలయంలో స్త్రీనిధి రికవరీ యాప్, సురక్ష పథకం వాల్ పోస్టర్‌ను పీడీ ఆవిష్కరించారు. పీడీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక గ్రూపు మహిళలకు అత్యవసర సమయాల్లో స్త్రీనిధి రుణాలు సకాలంలో మంజూరు చేస్తున్నామన్నారు. రూ.0.92ల తక్కువ వడ్డీతో రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు రికవరీ యాప్ ద్వారా తిరిగి చెల్లించాలన్నారు. మహిళలు తీసుకున్న రుణం, వడ్డీతో కలిపి నెలకు ఎంత చెల్లించాలనే వివరాలు వాల్‌పోస్టర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. వాల్ పోస్టర్‌ను ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంచి మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్త్రీనిధి సురక్ష పథకం ద్వారా సభ్యురాలు మరణిస్తే మిగిలిన నగదు చెల్లించనవసరం లేదన్నారు. రుణాలు మంజూరు చేయడానికి మహిళలు ఎవరికి నగదు ఇవ్వొద్దని ఆ విధంగా నగదు డిమాండ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏజీఎం కామక్షయ్య, డీపీఎంలు మురళి, కామాక్షి పాల్గొన్నారు.

భూసేకరణకు డిప్యుటేషన్‌పై రెవెన్యూ ఉద్యోగులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని రామాయపట్నం పోర్టుతోపాటు రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూసేకరణకు పెద్ద సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ప్రభుత్వం నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి, ప్రకాశం జిల్లాలో పని చేస్తున్న ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై నియమించారు. వీరందరూ కందుకూరు, కావలి కేంద్రాలుగా భూసేకరణకు సంబంధించిన విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

సోమశిలకు నిర్లక్ష్య గండం

- ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణలో అలసత్వం
- నిండు కుండగా జలాశయం
- ఈశాన్య రుతుపవనాల రాకతో రాబోయే రెండు నెలలు తుఫాన్లు, భారీ వర్షాలు
- వచ్చే ప్రతి క్యూసెక్కునూ దిగువకు వదలాల్సిందే
- ప్రాజెక్ట్ 12 గేట్లలో 11, 12 నంబర్లు పూర్తిగా బ్లాక్
- ఇటీవల వరదలు రావడంతో 5, 6, 7 గేట్ల ద్వారా నీటి విడదల
- అత్యవసర పరిస్థితుల్లో మిగిలినవి లిఫ్ట్ అవుతాయో లేదో తెలియని పరిస్థితి
- ఇప్పటికీ టెస్ట్ చేయని అధికారులు
- 2021లో ఆకస్మిక వరద రావడంతో 12 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో ప్రాజెక్ట్ భద్రం
- ఇప్పుడూ అలాంటి పరిస్థితి వస్తే ఏమౌతుందని ప్రజల అందోళన



'నెల్లూరు సీమ నీట మునిగేను'.. అంటూ శ్రీపోతులూరు వీరబ్రహ్మంగారు చెప్పిన జోస్యం నిజం కాబోతుందా? అంటే.. సోమశిల జలాశయం నిర్వహణలో నిర్లక్ష్యం అందుకు దర్పణం పడుతోంది. సోమశిల డ్యామ్ వల్లే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం అవుతుందని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. తాజా పరిస్థితి చూస్తే ప్రాజెక్ట్ గేట్ల నిర్వహణలో అధికారుల అలసత్వం కారణంగా గండం పొంచి ఉందనే అభిప్రాయం వెల్లడవుతోంది. ప్రస్తుతం జలాశయం 74 టీఎంసీలతో నిండుకుండగా ఉంది. డ్యామ్‌కు 12 క్రస్ట్‌గేట్లు ఉంటే.. అందులో రెండు గేట్లు పూర్తిగా బ్లాక్ అయిపోయాయి. ఇటీవల వరద దిగువకు మూడు గేట్ల ద్వారానే వదిలారు. మిగతా గేట్ల పరిస్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో భారీ వరదలు వస్తే ప్రాజెక్ట్ భద్రతపై భయాందోళన నెలకొంది.



ఒకటో నంబరు క్రస్ట్ గేట్‌కు స్టాప్‌లాక్ గేటు అమర్చిన దృశ్యం

సోమశిల: నెల్లూరు జిల్లా రైతాంగానికి తాగు, చెన్నై, తిరుపతి నగరాలకు తాగునీరందించే సోమశిల జలాశయం భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రాజెక్ట్ నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం గండం పొంచి ఉందని తెలుస్తోంది. ప్రాజెక్ట్ నిర్వహణకు గతంలో సుమారు 30 మంది వరకు సిబ్బంది విధుల్లో ఉండేవారు. అయితే ప్రస్తుతం కేవలం నలుగురికే పరిమితం కావడంతో జలాశయం నిర్వహణ లోపం కనిపిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 74 టీఎంసీలు ఉన్నాయి.

ఎందుకీ భయం.. ఏమానుమానాలు?

సోమశిల జలాశయానికి 12 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. అన్ని క్రస్ట్ గేట్ల ద్వారా ఒకేసారి నీటిని విడుదల చేస్తే 24 గంటల వ్యవధిలో గరిష్ఠంగా 6 లక్షల నుంచి 6.50 లక్షల నీటి విడుదల చేసే అవకాశం ఉందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం జలాశయంలో 11, 12వ క్రస్ట్ గేట్లు పూర్తిగా బ్లాక్ అయ్యాయి. గేట్లు లిఫ్ట్ చేసే రోప్‌లు పూర్తిగా దెబ్బతినడంతో అవి లిఫ్ట్ అయ్యే సమయంలో తెగిపోయే అవకాశం ఉండడంతో రోప్‌లు మార్చే ప్రక్రియ విషయంలో సంబంధిత అధికార యంత్రాంగం ఆది నుంచి అలవికాని నిర్లక్ష్యం ప్రదర్శించింది. జలాశయంలో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్న సమయంలోనే చేయాల్సి ఉన్నా.. వేసవి కాలం అంతా పట్టించుకోలేదు. తాజాగా ఎగువ నుంచి ఇటీవల వరద రావడంతో ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. ఈ క్రమంలో ప్రాజెక్ట్ నుంచి కేవలం 5, 6, 7 క్రస్ట్ గేట్ల నుంచి మాత్రమే నీటిని దిగువకు విడుదల చేయడంతో మిగతా గేట్ల లిఫ్ట్‌పై అనేక అనుమానాలు ఉన్నాయి. 1, 2, 3, 4, 8, 9, 10 గేట్ల రోప్‌లు సైతం తుప్పు పట్టి ఉన్నాయి. దాదాపుగా నాలుగేళ్లుగా ఈ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసిన సందర్భం లేదు. ప్రధానంగా సిబ్బంది కొరత కారణంగా ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. భారీ స్థాయిలో వరదలు వస్తే పరిస్థితి ఏమిటనే భయం జిల్లా వాసులను వెంటాడుతోంది.



జలాశయం మీదనున్న నూతన రోప్‌లు

పొంచి ఉన్న ప్రమాదం

గ్రేటర్ రాయలసీమపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం అధికంగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు విస్తరించిన సమయంలో అడపాదడపా వర్షాలు కురిసినా రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలపై పెద్దగా వర్ష ప్రభావం ఉండదు. తాజాగా ఈశాన్య రుతుపవనాలు రాకతో వాతావరణ మార్పులు సంభవించాయి. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ ఆకస్మిక వర్షాలు, వరదలు వస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఏ స్థాయిలో వర్షాలు పడుతాయో ఎవరూ ఊహించలేని పరిస్థితి. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల ప్రభావంగా ఎగువ ప్రాంతాల్లో, జలాశయ ప్రాంతంలో కురిసే ప్రతి వర్షపు చుక్క నేరుగా సోమశిల జలాశయానికి చేరుతోంది. ఇప్పటికే నిండుకుండగా ఉన్న జలాశయానికి వచ్చే వరద జలాలను నిల్వ ఉంచేందుకు వీలులేనందున దిగువకు విడుదల చేయాల్సి పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో గతంలో వచ్చిన స్థాయిలో వరద వస్తే.. క్రస్ట్ గేట్లను లిఫ్ట్ చేసి వరద దిగువకు విడుదల చేయాలంటే.. 11, 12 క్రస్ట్ గేట్లు పూర్తిగా బ్లాక్ అయిపోవడంతో మిగిలిన పది గేట్లలో ప్రస్తుతం 5, 6, 7 క్రస్ట్ గేట్లు సేఫ్‌గానే ఉన్నాయని ఇటీవల స్పష్టమైంది. మిగతా గేట్ల విషయంలో జలాశయం అధికారులకే స్పష్టత లేదని సంబంధిత అధికార వర్గాల ద్వారా స్పష్టమవుతోంది.



తుప్పు పట్టిన రెండో క్రస్ట్‌గేట్ రోప్‌లు

'తుంగభద్రకు పట్టిన గతి తప్పదు'

ఎనిమిది నెలల క్రితం రాష్ట్ర జలవనరుల సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు జలాశయ స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రాజెక్ట్ పరిశీలనకు వచ్చారు. జలాశయ ఎస్‌ఈ, ఈఈ, డీఈ, సిబ్బందితో కలిసి జలాశయ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన క్రస్ట్ గేట్ల దుస్థితి చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేట్ల విషయంపై కనీస నిర్వహణ చేయకపోవడంతో ఆయన మండిపడ్డారు. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ గేట్లకున్న రోప్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి.. ఇలానే మార్చకుండా మరమ్మతులు చేయకుండా వదిలేస్తే గతంలో తుంగభద్రకు పట్టిన గతి ఈ ప్రాజెక్ట్‌కు పడుతుందన్నారు.

వణికించిన 2021 నవంబర్ వరదలు

సోమశిలకు నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఎన్నడూ భారీ స్థాయిలో వరదలు వచ్చిన సందర్భం లేదు. 2021 నవంబర్‌లో ఎగువన అన్నమయ్య డ్యామ్ తెగి ప్రాజెక్ట్‌కు ఊహించని స్థాయిలో వరద వచ్చింది. రాత్రికి రాత్రే ఒక్కసారిగా ప్రాజెక్ట్ 12 క్రస్ట్ గేట్లు ఎత్తి సుమారుగా 6 లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో దిగువన పెన్నానది తీరం వెంబడి అనేక ప్రాంతాల ముంపునకు గురయ్యాయి. ఎగువ నుంచి వచ్చిన వరదను ఆ స్థాయిలో దిగువకు విడుదల చేయకపోతే ప్రాజెక్ట్ ప్రమాదంలో పడేదని జలవనరుల నిపుణులు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో గండం గడిచిపోయింది. ఆ తర్వాత ఆ స్థాయిలో గత మూడేళ్లుగా వరదలు రాలేదు.

నూతన రోప్‌లు వచ్చి నాలుగు నెలలు

రాష్ట్ర జలవనరుల సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు పరిశీలించిన రెండు నెలలకు కాంట్రాక్ట్ అప్పగించి నూతన రోప్‌లను ప్రాజెక్ట్ వద్దకు చేర్చారు. అప్పట్నుంచి సుమారు నాలుగు నెలలు అవుతున్న రోప్‌ల మరమ్మతులు చేయలేదు, ఇటీవల ఒకటో నంబర్ క్రస్ట్ గేటుకు స్టాప్ లాక్ అమర్చి మరమ్మతు చేయాలని ముందుకు వచ్చారు. ఈ తరుణంలో వరదలు వచ్చి జలాశయం పూర్తిగా నిండిపోయింది. ప్రస్తుతం నీటిలో రోప్‌లో మార్చేందుకు సంబంధిత వర్కర్లు రావడం లేదని జలాశయ అధికారులే చెబున్నారని సమాచారం.

ఇప్పట్లో రోప్‌లు మార్చలేము

జలాశయం పూర్తిసామర్థ్యానికి చేరుకోవడంతో క్రస్ట్ గేట్ల రోప్‌లు మార్చలేకున్నాం. నూతన రోప్‌ను ఏర్పాటు చేయాలంటే స్టాప్ లాక్ గేట్లను అమర్చుకున్న తర్వాత సుమారు నాలుగు రోజులు పడుతుంది. ఈలోపు వరద ఉధృతి పెరిగి నీటిని విడుదల చేయాల్సి వస్తే స్టాఫ్ లాక్ గేట్లు అడ్డొస్తాయి. అందువల్ల రోప్‌ల మార్పిడి పనులను ప్రస్తుతం నిలిపివేశాం. జలాశయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రిటైర్డ్ కావడంతో కొంత సిబ్బంది కొరత ఉంది. కేవలం 11 ,12 గేట్ల రోప్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అవి లిఫ్ట్ అయ్యే సమయంలో తెగిపోయే అవకాశం ఉంది. వాటిని ఆపరేట్ చేయవద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. మిగతా గేట్లు బాగానే ఉన్నాయి.

– శ్రీనివాసులు, సోమశిల జలాశయ ఈఈ

పత్రికా స్వేచ్ఛను హరించడమే



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఉదయగిరి: ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రికా రంగం మూల స్తంభం. వార్తల విషయంలో ప్రతికలకు ఎంతో స్వేచ్ఛ ఉంది. ఆ స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం దాడి చేస్తోందంటూ ఉదయగిరి నియోజకవర్గంలోని పలువురు విలేకరులు ధ్వజమెత్తారు. 'సాక్షి' మీడియాపై ప్రభుత్వం కేసులు బనాయించడం, పోలీసులతో కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురి చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో మస్తాన్‌రెడ్డిలకు అర్ధరాత్రి నోటీసులు జారీ చేయడం, విచారణ పేరుతో వేధించడం తగదన్నారు. పత్రికలు ప్రజల తరపున పోరాడే వ్యవస్థ అని, ప్రచురించే వార్తలో సందేహాలుంటే న్యాయబద్ధ రీతిలో వ్యవహరించాలి తప్ప అక్రమంగా కేసులు పెట్టడం తగదన్నారు. ఈ ధోరణితో ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



జర్నలిస్టులను వేధించడం తగదు



సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు చేరవేడం జర్నలిస్టుల విధి. మూడో మైలు దగ్గర మద్యం షాపు వద్ద ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయంపై స్థానికుల సమాచారం మేరకు 'సాక్షి' బ్యూరో మస్తాన్‌రెడ్డి వార్తను రాశారు. దీనిపై కక్ష కట్టిన ప్రభుత్వం అక్రమ కేసులతో అర్ధరాత్రి నోటీసులతో భయపెడుతూ వేధించడం తగదు.

– జయరాజు, జర్నలిస్టు సంఘాల జేఏసీ

పత్రికల గొంతు నొక్కకండి



జర్నలిస్టులకు పార్టీలను ఆపాదించడం సరికాదు. ఏ పార్టీ అయినా రాజకీయంగానే పోరాడాలే తప్ప జర్నలిస్టులపై కక్ష సాధించడం, పత్రికల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య హితం కాదు. ఏదైనా అభ్యంతరకరమైన వార్త ప్రచురితమైతే వివరణ కోరాలే కానీ, 'సాక్షి' ఎడిటర్, బ్యూరో చీఫ్, రిపోర్టర్లపై కేసులు పెట్టి పోలీసుల ద్వారా నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో బెదిరించడం దుర్మార్గం

– పద్రి బాలకృష్ణ, జర్నలిస్టు సంఘాల జేఏసీ

జర్నలిస్టు సంఘాల నిరసన

మనుబోలు: 'సాక్షి' మీడియాపై పోలీసుల వేధింపులు అప్రజాస్వామికమని జర్నలిస్టు సంఘం నేత బాబూ మోహన్‌దాస్ అన్నారు. ఎడిటర్ ధనుంజయరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జిలను కేసుల పేరుతో వేధించడాన్ని నిరసిస్తూ శనివారం మనుబోలు రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐ అరుణ్‌తేజ్‌కు మీడియా ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ తమకు గిట్టని వార్తలు రాసే జర్నలిస్టులను పోలీసులు కేసుల పేరుతో వేధించడం దుర్మార్గమన్నారు. జర్నలిస్టులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించుకునే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు రవీంద్ర బాషా, శ్రీనివాసులు, జగదీష్, జయకర్, సుధాకర్, శంకర్, సునీల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం



'సాక్షి' పత్రిక ప్రజల గొంతుకగా వార్తలు రాస్తోందని, ఎడిటర్ ధనుంజయరెడ్డి, బ్యూరో మస్తాన్‌రెడ్డి, రిపోర్టర్‌పై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం. వార్తపై అభ్యంతరాలు ఉన్నాయని ఎవరైనా భావిస్తే రిజాయిండర్ ఇవ్వాలి. లేదంటే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలి. అంతే గాని అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టడం తగదు.

– ఐ. మల్లికార్జున, జర్నలిస్టు సంఘాల జేఏసీ

జర్నలిస్టుల స్వేచ్ఛను కాపాడాలి

జర్నలిస్టుల స్వేచ్ఛను ప్రభుత్వం కాపాడాలి. అలాంటిది ప్రభుత్వమే జర్నలిస్టులపై అక్రమ కేసులతో బెదిరించాలనుకోవడం దారుణం. ఇలాంటి పద్ధతి సమాజానికి మంచిది కాదు. పార్టీల కతీతంగా జర్నలిస్టులు పని చేస్తారు. 'సాక్షి' పత్రికను టార్గెట్ చేస్తూ అందులో పనిచేసే జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేస్తే జర్నలిస్టులు ఉద్యమిస్తారు.

– ప్రేమ్‌చంద్ (చందు), జేఏసీ

అమరావతికి రేషన్ పంచాయితీ

- టీడీపీ నేతల మధ్య రేషన్ బియ్యం విభేదాలు
- నుడా ఛైర్మన్ కోటంరెడ్డి బహిరంగ విమర్శలపై అధిష్టానం సీరియస్
- మంత్రి నారాయణ టెలి కాన్ఫరెన్స్ పెట్టి ఆగ్రహం
- జిల్లా నేతలకు చీవాట్లు పెట్టిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, అబ్దుల్ అజీజ్

నెల్లూరు సిటీ: జిల్లాలో టీడీపీ నేతలు విచ్చలవిడిగా సాగిస్తున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఆ పార్టీని ఇరకాటంలో పెట్టింది. నెలకు రూ.కోట్లల్లో ఈ దందా జరుగుతోంది. అయితే తమకు అందాల్సిన వాటాలు అందకపోవడమో.. మరేదో తెలియదు కానీ.. ఆ పార్టీ నేత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటీవల మంత్రి నారాయణ కీలక అనుచరుడు, సివిల్‌సప్లయ్స్ శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని ప్రత్యక్షంగా, జనసేన పార్టీని పరోక్షంగా డీసీఎం పవన్‌కల్యాణ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేసి రేషన్ మాఫియా దందాపై బహిరంగంగా ఆరోపణలు చేయడం తెలిసిందే. ఈ పరిణామాలు రెండు పార్టీల్లోనూ కాక పుట్టించింది. టీడీపీ నేత బహిరంగ విమర్శలు ఆ పార్టీకి తలనొప్పిగా పరిణమించాయి. మంత్రి నారాయణ నియోజకవర్గ పరిధిలోని నేతలు పార్టీ పరువును బజారుకీడ్చడంతో సీఎం చంద్రబాబు సీరియస్ అయినట్లు సమాచారం. మరో వైపు నాదెండ్ల మనోహర్ సైతం మంత్రి నారాయణపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలో నారాయణ సదరు నేతలపై టెలికాన్ఫరెన్స్‌లో తీవ్ర స్థాయిలో మండిపడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వరుస పరిణామాలు కూటమి పార్టీలను ఇరకాటంలో పెట్టడంతో అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగింది. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలను శనివారం అమరావతికి పిలిపించిన పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చీవాట్లు పెట్టారని సమాచారం. బహిరంగ విమర్శలు ఎందుకు చేసుకున్నారు? రేషన్ బియ్యంలో పాత్ర ఎవరిది ఉంది? మీడియా ముందు ఎందుకు విమర్శలు చేశారు? అంటూ పలు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు ఈ విషయంపై ఆగ్రహంగా ఉన్నారని చెప్పినట్లు సమాచారం. మరోసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిసింది. వీరిద్దరితోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్యాలకనుగుణంగా చదవాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వెంకటాచలం: విద్యార్థులు తమ లక్ష్యాలకనుగుణంగా చదువులను కొనసాగించాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద గల వర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న వనరులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ అచార్యులు సుజా నాయర్, చెంచురెడ్డి, విభాగాధిపతి సాయి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పరంజా పైనుంచి పడి కూలీ మృతి



ఉలవపాడు: నిర్మాణ పనులు జరుగుతున్న బిల్డింగ్ పైనుంచి పడి బేల్దారి కూలీ మృతి చెందిన ఘటన ఉలవపాడులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఉలవపాడులోని కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. ఈ తరుణంలో మండల పరిధిలోని ఆత్మకూరుకు చెందిన తన్నీరు మాధవరావు (55) రెండో అంతస్తులో పరంజాపైకెక్కి పని చేస్తున్నారు. ఈ తరుణంలో ప్రమాదవశాత్తూ జారి కిందపడిపోయారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. మార్గమధ్యలోనే ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఉలవపాడు వైద్యశాలలో ఉంచారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగా ఉపకార వేతనాల నమోదు ప్రక్రియ

ఆత్మకూరు: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, కళాశాలల్లోని విద్యార్థుల ఉపకార వేతనాల నమోదు ప్రక్రియను నిబంధనల మేరకు పక్కాగా చేపట్టాలని సంక్షేమ శాఖ జిల్లా నోడల్ అధికారి, సంక్షేమ సాధికారత అధికారి శోభారాణి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్, వసతి గృహ సంక్షేమాధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని పట్టణ పరిధిలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన విద్యార్థుల పరిశీలన, జాయింట్ అకౌంట్లపై వివరాలను ఆరాతీశారు. డివిజన్ పరిధిలో పెండింగ్ వెరిఫికేషన్లు 130 ఉన్నాయని తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూఓ బ్రహ్మానందచారి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్.. గందరగోళం



చిత్తడిగా మారిన వీఆర్సీ మైదానం



దుకాణాల ఏర్పాటులో నిమగ్నమైన నిర్వాహకులు

- బాణసంచా దుకాణాల కేటాయింపునకు ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహణ
- ఏటా 60కు అనుమతి.. ఈసారి మాత్రం 41
- అధికారులను ప్రశ్నించిన లైసెన్స్‌దారులు



షాపులను చూపాలంటూ తహసీల్దార్ వాహనాన్ని చుట్టుముట్టిన లైసెన్స్‌దారులు

నెల్లూరు సిటీ: బాణసంచా దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లక్కీడిప్ ఈ ఏడాది గందరగోళంగా మారింది. ప్రక్రియను నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. అయితే ఇందులో తమకు అన్యాయం జరిగిందంటూ అధికారులపై కొందరు లైసెన్స్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి లైసెన్స్‌దారులకు నచ్చజెప్పి ప్రక్రియను పూర్తి చేశారు. వీఆర్సీ గ్రౌండ్స్‌లో 41.. వైఎమ్సీఏ గ్రౌండ్స్‌లో 36.. చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో 25.. గోషాస్పత్రి ప్రాంతంలో 11.. ఆరెస్సార్‌లో 27, బీవీఎస్ గర్ల్స్ హైస్కూల్ వద్ద ఒక దుకాణానికి అనుమతిచ్చారు.

ఈసారి కుదింపు

వాస్తవానికి వీఆర్సీ గ్రౌండ్స్‌లో ఏటా 60 నుంచి 65 దుకాణాలకు అనుమతులిచ్చేవారు. అయితే ఈ ఏడాది ఓ ప్రైవేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో స్టేజ్ ఏర్పాటును ప్రారంభించారు. దీంతో అక్కడ 41 దుకాణాలకే అనుమతులను మంజూరు చేశారు. దీనిపై లైసెన్స్‌దారులు మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఏర్పాటు చేసుకుంటున్నామని, ఇప్పుడు మరోచోట పెట్టుకోవాలని అధికారులు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 42వ నంబర్ నుంచి వచ్చే దుకాణాలను ఇతర చోట్ల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మ్యాప్‌లో పొరపాటు

వీఆర్సీ గ్రౌండ్స్‌లో 41వ దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం లేకపోవడంతో లైసెన్స్‌దారుడు మండిపడ్డారు. తానెక్కడ పెట్టాలని ప్రశ్నించారు. ఫైరింజిన్ ప్రవేశానికి వీఆర్సీ కళాశాల నుంచి దారిని ఏర్పాటు చేయడంతో ఈ మార్పు జరిగింది. చివరికి ఓ దుకాణాన్ని కుదించి దీని ఏర్పాటుకు వీలు కల్పించారు. మరోవైపు భారీ వర్షాలతో ఇక్కడి మైదానం చిత్తడిగా మారడం ఇబ్బందిగా పరిణమించింది.

సమ్మె విరమణ శోచనీయం



మాట్లాడుతున్న నేతలు

- డిమాండ్లు నెరవేర్చేంత వరకు దశలవారీ పోరాటాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ప్రధాన డిమాండ్లను నెరవేర్చకుండానే సమ్మెను విరమించడం శోచనీయమని పలువురు పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా కార్యదర్శులు హజరత్తయ్య, జాకీర్‌హుస్సేన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జా సుమన్ విలేకరులతో శనివారం మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, గ్రేడ్ – 2 జేఎల్ఎంల సమస్యల పరిష్కారం తదితరాలపై సమ్మెకు విద్యుత్ జేఏసీ పిలుపునిచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో యాజమాన్యం, ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో డిమాండ్లను నెరవేర్చకుండానే మధ్యలో సమ్మెను విరమించడం శోచనీయమని చెప్పారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు. దశలవారీ పోరాటాలు, ఆందోళనలు చేసేందుకు విద్యుత్ స్ట్రగుల్ కమిటీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. యూనియన్ ఆఫీస్ బేరర్స్ పెంచల ప్రసాద్, జిల్లా నేతలు సురేంద్ర, కొండయ్య, జనార్దన్, దయాకర్, నారాయణ, రామయ్య, మస్తాన్, ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి: రూ.35
సన్నవి: రూ.20
పండ్లు: రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	:రూ.127	స్కిన్‌లెస్ చికెన్	:రూ.254
లేయర్	:రూ.118	లేయర్ చికెన్	:రూ.200
బ్రాయిలర్ చికెన్	:రూ.230		

పెట్రోల్ బంకులో తనిఖీలు

పొదలకూరు: పట్టణంలోని సంగం రోడ్డు వద్ద గల హెచ్‌పీ పెట్రోల్ బంకులో తనిఖీలను లీగల్ మెట్రాలజీ అధికారులు, సంస్థ ప్రతినిధులు శనివారం చేపట్టారు. బంకులో లీగల్ మెట్రాలజీ శాఖ మూడు జిల్లాల అధికారి ఐజాక్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదిన తనిఖీ చేశారు. ఐదు లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను పట్టుకుంటే 140 ఎమ్మెల్ తేడా చూపుతున్న అంశాన్ని గుర్తించి రెండు పంపులను సీజ్ చేశారు. ఈ క్రమంలో హెచ్‌పీ కంపెనీ ప్రతినిధులు, లీగల్ మెట్రాలజీ శాఖ తనిఖీలు చేపట్టి.. పెట్రోల్, డీజిల్ తగ్గడంలో సాంకేతిక కారణాలున్నాయా లేక ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారనే అంశాన్ని పరిశీలించారు. కాగా సదరు బంకుపై గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నారని తెలిసింది.

వైఎస్సార్సీపీ అనుబంధ విభాగ కమిటీల నియామకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగ జిల్లా కమిటీల్లో పలువుర్ని నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది.

➡ యూత్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గుంటక వంశీ, సెక్రటరీగా ఆరిపుల్లా హుస్సేనీ (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నెల్లూరు మధు, అత్తిపాటి మస్తానయ్య (కోవూరు)ను నియమించారు.

➡ మహిళా విభాగ కమిటీ జనరల్ సెక్రటరీలుగా బషీరా (నెల్లూరు రూరల్), గొల్లపోతు తిరుపతమ్మ (కందుకూరు), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బత్తుల కుమారి (కందుకూరు), ప్రమీల, భారతమ్మ (నెల్లూరు రూరల్) నియమితులయ్యారు.

➡ రైతు విభాగ కమిటీ సెక్రటరీగా బయ్యపురెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మోపూరు చంద్రశేఖర్‌రెడ్డి (నెల్లూరు రూరల్)ను నియమించారు.

➡ ఎస్సీ సెల్ కమిటీ జనరల్ సెక్రటరీగా బట్టా జయకృష్ణ (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సోకా దాసు, మునిప్రసాద్ (వెంకటగిరి), పాట్లూరి వెంకటేశ్వర్లు (నెల్లూరు రూరల్) నియమితులయ్యారు.

➡ మైనార్టీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఇక్బాల్, జనరల్ సెక్రటరీగా రసూల్(నెల్లూరు రూరల్), సెక్రటరీగా ఖాదర్‌మస్తాన్ (వెంకటగిరి), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మస్తాన్ (నెల్లూరు రూరల్), జిలానీ (వెంకటగిరి)ని నియమించారు.

➡ మున్సిపల్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మురళీకృష్ణ (వెంకటగిరి), సెక్రటరీగా జగన్నాథం శ్రీనివాసులు (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బల్లి రాజారత్నం (నెల్లూరు రూరల్), పూజారి శ్రీను, వలికల కృష్ణయ్య (వెంకటగిరి) నియమితులయ్యారు.

➡ వీవర్స్ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీగా చిన్నా, సెక్రటరీగా ఆదినారాయణ (వెంకటగిరి), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పెండెం లక్ష్మీనరసయ్య (నెల్లూరు రూరల్), శ్రీనివాసులు, ప్రభాకర్ (వెంకటగిరి)ను నియమించారు.

➡ ఎంప్లాయీస్, పెన్షనర్ల వింగ్ కమిటీ సెక్రటరీగా నక్కా మనోహర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దేవిరెడ్డి నరసింహారెడ్డి (వెంకటగిరి).. వైఎస్సార్ టీయూసీ కమిటీ జనరల్ సెక్రటరీలుగా చీర్ల వెంకురెడ్డి (వెంకటగిరి), పెంచలయ్య (నెల్లూరు రూరల్), సెక్రటరీలుగా రాజారెడ్డి, రమేష్ (వెంకటగిరి), చింతలపంటి వెంకటేశ్వర్లు (కోవూరు), శ్రీకాంత్ (నెల్లూరు రూరల్).. అంగన్‌వాడీ కమిటీ జనరల్ సెక్రటరీగా గోపిదేశి రమణయ్య (వెంకటగిరి), సెక్రటరీగా కంభాపు రాజమ్మ (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రిజ్వాన్ (నెల్లూరు రూరల్), సుబ్బమ్మ (వెంకటగిరి) నియమితులయ్యారు.

➡ ఐటీ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీలుగా శ్రీనివాసరాజు (వెంకటగిరి), ఏడుకొండలు (నెల్లూరు రూరల్), సెక్రటరీగా వేణుగోపాల్‌రెడ్డి (వెంకటగిరి), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఇమామ్ (నెల్లూరు రూరల్), సాయిఈశ్వర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, పవన్ (వెంకటగిరి).. పబ్లిసిటీ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీలుగా ప్రభాకర్‌రెడ్డి (వెంకటగిరి), అక్కి చంద్రారెడ్డి (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అన్నపురెడ్డి శేఖర్, మధుసూదన్‌రెడ్డి (నెల్లూరు రూరల్), నాపా రాఘవేంద్ర, శ్రీహరిరెడ్డి (వెంకటగిరి).. డాక్టర్స్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ (వెంకటగిరి), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కల్యాణ్ (నెల్లూరు రూరల్), అనిల్‌కుమార్ (వెంకటగిరి)ను నియమించారు.

➡ దివ్యాంగుల విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులురెడ్డి (నెల్లూరు రూరల్), జనరల్ సెక్రటరీలుగా ఖాదర్‌బాషా (నెల్లూరు రూరల్), నేతగాని రామయ్య (వెంకటగిరి), సెక్రటరీగా కృష్ణ (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విజయమ్మ (నెల్లూరు రూరల్), కృష్ణవేణి (వెంకటగిరి).. బీసీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉడతా మురళీయాదవ్, సెక్రటరీగా మన్నవరపు రవికుమార్ (నెల్లూరు రూరల్).. క్రిస్టియన్ మైనార్టీ సెల్ సెక్రటరీగా సునీల్ గవాస్కర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆశీర్వాదం, కిశోర్ (నెల్లూరు రూరల్) నియమితులయ్యారు.

➡ స్టూడెంట్స్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మధుగౌడ్, జనరల్ సెక్రటరీగా కల్యాణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రిత్విక్ (నెల్లూరు రూరల్).. పంచాయతీరాజ్ వింగ్ కమిటీ సెక్రటరీగా వేమిరెడ్డి హరిశివారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీనివాసులురెడ్డి (నెల్లూరు రూరల్).. ఆర్టీఐ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బండి శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీగా మాథ్యూస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వెంకటరమణయ్య (నెల్లూరు రూరల్)ను నియమించారు.

➡ వలంటీర్స్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా శ్యామ్‌సుందర్‌రెడ్డి, సెక్రటరీగా శివకుమార్‌రెడ్డి (నెల్లూరు రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తుపాకుల ప్రకాష్ (నెల్లూరు రూరల్), రుక్మిణి, ప్రసన్న (కోవూరు).. గ్రీవెన్స్ సెల్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అశోక్‌కుమార్, అయితా శ్రీనివాసులు (నెల్లూరు రూరల్).. వాణిజ్య విభాగ కమిటీ జనరల్ సెక్రటరీగా తమ్మిశెట్టి శ్రీధర్, తలారి వెంకటేశ్వర్లునాయుడు (నెల్లూరు రూరల్) నియమితులయ్యారు.

➡ కల్చరల్ విభాగ కమిటీ సెక్రటరీగా ఫరీదా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విజయనిర్మల, నందిపాటి గృహలక్ష్మి (నెల్లూరు రూరల్).. సోషల్ మీడియా విభాగ వైస్ ప్రెసిడెంట్‌గా బాబీభగత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నవీన్ (నెల్లూరు రూరల్).. బూత్ కమిటీ వింగ్ సెక్రటరీగా ఆవుల అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గంగి కృష్ణారెడ్డి (నెల్లూరు రూరల్)ను నియమించారు.

➡ లీగల్ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా విక్రమ్ కుమార్‌రెడ్డి (నెల్లూరు రూరల్), నజీర్ (ఆత్మకూరు), శ్రీనివాసులురెడ్డి (కోవూరు), జనరల్ సెక్రటరీలుగా మంజుల, ముజిబుర్ రెహ్మాన్ (నెల్లూరు సిటీ), ప్రసాద్‌రెడ్డి (కందుకూరు), గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి), సెక్రటరీలుగా సాయికృష్ణారెడ్డి (నెల్లూరు రూరల్), కనకాద్రి, రాజారెడ్డి (నెల్లూరు సిటీ), సునీల్‌బాబు (కావలి), సుల్తాన్‌బాషా (కందుకూరు), ప్రతాప్, బాలరాయులు (సర్వేపల్లి), జాయింట్ సెక్రటరీగా సుజన (కోవూరు), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఉపేంద్రరెడ్డి, ఆనంద్, శ్రావణ్‌కుమార్ ముజీబ్ రెహ్మాన్, సుజిత్‌రెడ్డి (నెల్లూరు రూరల్), శివప్రసాద్, సుమంత్‌రెడ్డి, వినయ్ (నెల్లూరు సిటీ), చంద్రశేఖర్, భానుచందర్ (కోవూరు), సునీల్‌కుమార్‌సింగ్, పవన్ కల్యాణ్ (కావలి), మస్తాన్ (సర్వేపల్లి) నియమితులయ్యారు.

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రే లక్ష్యం కావాలి



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

నెల్లూరు(బారకాసు): స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రే లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని బట్వాడిపాళెం నుంచి సారాయంగడి సెంటర్, అక్కడి నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీని శనివారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వచ్ఛతలో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలని కోరారు. నూరు శాతం చెత్త సేకరణ జరగాలని చెప్పారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను తెలియజేశారు. కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు .

కండలేరులో 60 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 60 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 3,060 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. సత్యసాయి గంగకు 1900, పిన్నేరుకు 850, లోలెవల్‌కు 40, హైలెవల్‌కు 200, మొదటి బ్రాంచ్ కాలువలకు ఐదు క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.